సాక్షి
రాజన్న సిరిసిల్ల

సోమవారం ၊ 11 ၊ సెప్టెంబర్ ၊ 2023



నాంపల్లిగుట్టపై శ్రావణసందడి

వేములవాడఅర్బన్: నాంపల్లిగుట్టపై గల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. శ్రావణమాసం కావడంతో రద్దీ ఎక్కువగా ఉంది.



ఐసెట్ కౌన్సిలింగ్

వేములవాడఅర్బన్: అగ్రహారం శ్రీరాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం ఐసెట్ కౌన్సిలింగ్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రాజగోపాల్ తెలిపారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
27.0/25.0

జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వేగంగా వీస్తాయి.



నిరసన

సిరిసిల్లటౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరసనలు ఆదివారం తారాస్థాయికి చేరాయి. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని పోచమ్మకు బోనాలతో నిరసన తెలిపారు. వీరికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్ రెడ్డి సంఘీభావం తెలిపారు. 11 రోజులుగా సమ్మె చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు తమను పర్మినెంట్ చేయాలని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు.

హరహర మహాదేవ



వేములవాడ: రాజన్నను ఆదివారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.40 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కోడెమొక్కులు, అభిషేకాలు, సత్యనారాయణ వ్రతాలు, కల్యాణం మొక్కులు చెల్లించుకున్నారు. స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం పునర్వసు నక్షత్రోత్సవం సందర్భంగా సీతారామచంద్రస్వామికి పంచోపనిషత్ ద్వారా అభిషేకం, పరివార దేవతార్చనలు చేశారు. నేడు ఆలయంలో మాస శివరాత్రి వేడుకలు నిర్వహించనున్నారు.



నివాళి

సిరిసిల్లటౌన్: బహుజన చైతన్యానికి, మహిళాశక్తికి చాకలి ఐలమ్మ ప్రతీక అని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఐలమ్మ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆమె చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఆర్డీవో ఆనంద్‌కుమార్, బీసీ సంక్షేమాధికారి రాఘవేంద్ర, డీపీఆర్వో మామిండ్ల దశరథం, రజక సంఘం రాష్ట్ర నాయకుడు అక్కరాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు



సిరిసిల్లఅర్బన్: ఆత్మహత్య యత్నానికి పాల్పడిన ఒకరిని బ్లూకోట్ పోలీసులు కాపాడారు. జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌కు చెందిన గడ్డం నాగరాజు కుటుంబ కలహాలతో ఆదివారం ఉదయం కార్గిల్‌లేక్‌లో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అటుగా వెళ్తున్న బ్లూకోట్ పోలీసులు గమనించి నాగరాజును రక్షించి ఒడ్డుకు తీసుకొచ్చారు. ప్రాణాలకు తెగించి వ్యక్తిని కాపాడిన బ్లూకోట్ పోలీసులు జావ్వాజి లక్ష్మణ్‌ను స్థానికులు ప్రశంసించారు.

15న మెడికల్ కాలేజీ ప్రారంభం



మాట్లాడుతున్న తోట ఆగయ్య

సిరిసిల్లఅర్బన్: జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన మెడికల్ కాలేజీని ఈనెల 15న సీఎం కేసీఆర్ వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మంత్రి కేటీఆర్ చొరవతో జిల్లాకు అగ్రికల్చర్, నర్సింగ్, జేఎన్టీయూ కళాశాలలు వచ్చాయని, ప్రస్తుతం మెడికల్ కళాశాలను సీఎం కేసీఆర్ వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమానికి మంత్రి కేటీఆర్ హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర టెక్స్‌టైల్ పవర్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, కార్యదర్శి మ్యాన రవి, ముస్తాబాద్ ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, బండ నర్సయ్య ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



జెర్సీ ఆవిష్కరిస్తున్న జిందం కళ

సిరిసిల్లఅర్బన్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. స్థానిక బతుకమ్మ ఘాట్ వద్ద బతుకమ్మ ఘాట్ క్రికెట్ క్లబ్ జెర్సీని ఆదివారం ఆవిష్కరించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సీనియర్ నాయకుడు బొల్లి రామ్మోహన్, బతుకమ్మ ఘాట్ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు రవి, గౌరవాధ్యక్షుడు పాపారావు, సభ్యులు శ్రీకాంత్, ఆనంద్, మధు, శివశంకర్, సుమన్, రవీందర్, కృష్ణ, సురేష్ ఉన్నారు.

భూముల ఆక్రమణపై ఆందోళన

ముస్తాబాద్(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం సింగారంలో ఆలయ పూజారికి ఇచ్చిన భూమిని ఉపసర్పంచ్ ఆక్రమించుకుని చదును చేశాడని సర్పంచ్ మంగోలి నర్సాగౌడ్ అధికారులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ సింగారంలోని ఆలయ పూజారి శ్రీనివాస్‌చారి పేరిట సర్వేనంబర్ 220లో నాలుగున్నర ఎకరాలను ప్రభుత్వం ఇచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ఆ పూజారి కుటుంబం హైదరాబాద్‌లో ఉండడంతో.. గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి చదును చేశాడన్నారు. దీనిపై విచారణ చేపట్టి పూజారికి న్యాయం చేయాలని మాజీ సర్పంచ్ మల్లేశం, మాజీ ఎంపీటీసీ అంజయ్య, శ్రీనివాస్, మహబూబ్ కోరారు.

అపరిచితులు

‘రెండు నెలల క్రితం సిరిసిల్ల కలెక్టరేట్ రగుడు సర్కిల్ వద్ద ఓ వాహనం ద్విచక్రవాహనదారుడిని ఢీకొట్టి వెళ్లింది. ఆ ఘటనలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మరణించాడు. ఢీకొట్టి వెళ్లిన వాహనం ఏంటో తెలియదు. ఢీ కొట్టింది ఎవరో తెలియదు. గుర్తు తెలియని వాహనంగా పోలీసులు కేసు నమోదు చేశారు. అక్కడ సీసీ కెమెరాలు లేకపోవడంతో ఢీకొట్టిన వ్యక్తిని గుర్తించేందుకు సిరిసిల్ల పోలీసులు నానా తంటాలు పడాల్సి వచ్చింది. చివరికి పొరుగు రాష్ట్రం యువకుడు ఢీకొట్టి వెళ్లాడని గుర్తించారు. అప్పటికే అతను తన సొంత రాష్ట్రానికి పరారుకాగా.. పోలీసులు సదరు యువకుడిని పట్టుకొచ్చారు.

‘వేములవాడ శివారులోని పునరావాస కాలనీలో కల్లెం శ్రీనివాస్ జూన్ 5న కారులో రూ.5 లక్షలు ఉంచి తన సోదరి ఇంట్లోకి వెళ్లిరాగా గుర్తు తెలియని వ్యక్తులు కారు అద్దాలు పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఆరా తీయగా కర్ణాటకలోని షిమోగా జిల్లా భద్రావతికి చెందిన శివుడు, కల్యాణ్, సందీప్, సూరీలుగా గుర్తించారు. ఈ కేసులో వేములవాడ పోలీసులు శివను అరెస్ట్ చేశారు. మిగతా వారు పొరుగు రాష్ట్రాల్లోనే పరారీలో ఉన్నారు.

- జిల్లాలో పొరుగు రాష్ట్రాల కూలీల సంచారం
- వివరాలపై పోలీసుల ఆరా
- ఆధార్‌కార్డు, ఫోన్‌నంబర్లు, ఫింగర్‌ప్రింట్స్ సేకరణ



సిరిసిల్లలో పొరుగు రాష్ట్రాల యువకార్మికులు



లేబర్ అడ్డాపై వలస కూలీలు

సిరిసిల్ల: జిల్లా పొరుగు రాష్ట్రాల వలస కార్మికులు, దినసరి కూలీలకు ఉపాధి కల్పించే అడ్డాగా మారింది. ఇక్కడి పరిశ్రమలు, భవన నిర్మాణరంగం, ఇటుకబట్టీలు, సాగునీటి ప్రాజెక్టులు.. చివరి వరినాట్లు వేసేందుకు సైతం పొరుగు రాష్ట్రాల కూలీలు పనిచేస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ ప్రాంతాల్లో పొరుగు జిల్లాల కూలీలు పనిచేస్తున్నారు. పొరుగు రాష్ట్రాల కూలీలు ఎంత కష్టమైనా పని అయినా చేస్తారనే పేరుండడంతో పలువురు పరిశ్రమల యజమానులు వారినే పనిలోకి తీసుకుంటున్నారు. ఇలా జిల్లాలో వలసకార్మికుల సంఖ్య పెరిగింది.

వలస కూలీలపై నిఘా కరువు

ఉత్తరప్రదేశ్, బిహార్, రాజస్థాన్, ఒడిశా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన కార్మికులు జిల్లాకు ఎక్కువగా వస్తున్నారు. కామారెడ్డి, వరంగల్, పెద్దపల్లి రైల్వేమార్గాలు, హైదరాబాద్ నుంచి రోడ్డుమార్గాల్లో జిల్లాకు చేరుకుంటున్నారు. అలా వస్తున్న వారి వివరాలు ఎక్కడా నమోదు కావడం లేదు. ఏదైనా అసాంఘిక సంఘటన జరిగితే నిందితులను పట్టుకోవడం పోలీసులకు కష్టంగా మారుతోంది. వలసజీవులపై ఎలాంటి నిఘా లేకపోవడంతో గంజాయి, గుట్కా వంటి నిషేధిత పదార్థాల విక్రయాలు జిల్లాలో పెరిగాయి. వలస జీవుల్లో చాలా మంది శ్రమించి పనిచేస్తుండగా.. కొందరు చేసే అసాంఘిక పనులతో అందరిపైనా నిఘా ఉంచాల్సిన అవసరం ఉంది.

అప్రమత్తమైన పోలీసులు

సిరిసిల్ల పట్టణ పోలీసులు ఈ విషయంలో ముందున్నారు. ఇటీవలి కాలంలో సిరిసిల్లలో ఉండే వలస జీవులను గుర్తించి వారి ఫొటోలను, ఆధార్‌కార్డులను, ఫోన్‌నంబర్లను, ఫింగర్‌ప్రింట్స్ సైతం సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు 250 మంది వలస జీవుల సమాచారాన్ని సేకరించారు.

పోలీసులకు సమాచారం ఇవ్వాలి



ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో పొరుగు రాష్ట్రాల వలస జీవుల వివరాలను సేకరిస్తున్నాం. వలస కూలీలను ఎవరైన ఇక్కడికి పనికోసం తెచ్చుకుంటే వారి వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందించాలి. – ఉపేందర్, సిరిసిల్లటౌన్ సీఐ

మెడికల్ కాలేజీని పరిశీలించిన డీఎంఈ

- కళాశాల భవనం, హాస్టల్ భవనాల సందర్శన
- మిగులు పనులు పూర్తి చేయాలని సూచన



మెడికల్ కాలేజీ భవనాన్ని పరిశీలిస్తున్న డీఎంఈ డాక్టర్ రమేశ్‌రెడ్డి

సిరిసిల్ల: జిల్లా మెడికల్ కాలేజీని రాష్ట్ర వైద్య విద్య సంచాలకులు డాక్టర్ రమేశ్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. జిల్లా కేంద్రం శివారులోని పెద్దూరు బైపాస్ రోడ్డులో కొత్తగా నిర్మించిన మెడికల్ కాలేజీ భవనాన్ని తనిఖీ చేశారు. పెండింగ్ పనులను 15వ తేదీలోగా పూర్తిచేయాలని సూచించారు. వైద్య విద్యను అభ్యసించే విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బాలికలు, బాలుర హాస్టల్ భవనాలను డీఎంఈ పరిశీలించారు. టీఎస్ ఎంఎస్ఐడీసీ ఎస్ఈ దేవేందర్, డీఈఈ ఎస్వీ రమణ, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, మెడికల్ కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే బలహీనవర్గాల సంక్షేమం

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



కాంగ్రెస్‌లో చేరిన గంగిరెద్దుల కాలనీవాసులు

చందుర్తి(వేములవాడ): బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. చందుర్తి మండలం సనుగులలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. గ్రామానికి చెందిన 200 మందికి పైగా యువకులు, రైతులు కాంగ్రెస్‌లో చేరారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ నిధులు, నియామకాలు, నీళ్ల పేరిట తెచ్చుకున్న రాష్ట్రం సీఎం కేసీఆర్ కుటుంబానికి బంగారుమయమైందన్నారు. కాంగ్రెస్‌కు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్, బీజేపీలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. రైతులకు 9 గంటలపాటు ఉచిత విద్యుత్‌ను దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి అందించిన విషయాన్ని గుర్తు చేశారు. మండలంలోని సనుగులలోని శ్రీగోవిందరాజులస్వామిని ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. జెడ్పీటీసీ నాగం కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, జిల్లా కార్యదర్శులు గొట్టె ప్రభాకర్, ఇందూరి మధు, నాయకులు ముష్క ముకుందరెడ్డి, బొల్లిపల్లి నాగయ్యగౌడ్, బొల్లిపల్లి చిరంజీవిగౌడ్, ఏగోలపు శ్రీనివాస్‌గౌడ్, బొజ్జ మల్లేశం, పులి సత్తయ్య, వేల్పుల దేవస్వామి, ధర్మపురి శ్రీనివాస్, ఆవారి రమేశ్ పాల్గొన్నారు.

బీసీలు ఓటువేసే యంత్రాలు కావొద్దు

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు



సింహగర్జనకు వెళ్తున్న బీసీ సంఘం నాయకులు

సిరిసిల్ల: బీసీలు ఓటువేసే యంత్రాలు కావొద్దని, రాజకీయాలను శాసించేలా ఎదగాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు కోరారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో జరిగే బీసీల సింహగర్జన సదస్సుకు జిల్లా నుంచి భారీగా ఆదివారం తరలివెళ్లారు. హన్మాండ్లు మాట్లాడుతూ తరతరాలుగా రాజకీయ గులాంగిరిని బద్దలు కొట్టి రాజ్యాధికారం దిశగా సాగుతున్నారని పేర్కొన్నారు. ఏళ్లుగా పార్టీల జెండాలు మోస్తూ, జిందాబాద్‌లు కొడుతూ ఓటుబ్యాంకుగా మారామని.. ఆత్మగౌరవం కోసం ఐక్యం కావాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరవేణి మల్లేశ్ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో–ఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్, బీసీ సంఘం నాయకులు కంచర్ల రాజు, తిరుపతి, కమలాకర్, లక్ష్మణ్, ప్రశాంత్, విజయ్, స్వామి, సంజీవ్, తరుణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

‘వాసరవేణి’కి పెందోట పురస్కారం



పర్శరామ్‌కు పురస్కారం అందిస్తున్న ప్రతినిధులు

ముస్తాబాద్(సిరిసిల్ల): బాలసాహిత్యంలో విశేష రచనలు, పరిశోధనలు చేస్తున్న డాక్టర్ వాసరవేణి పర్శరామ్‌కు పెందోట సాహితీ పురస్కారాన్ని సిద్దిపేటలో ఆదివారం అందజేశారు. బాలసాహిత్యంలో చేస్తున్న పరిశోధనలు, రచనలకు ప్రతిష్ఠాత్మక పెందోట సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. అరవైకి పైగా బాలసాహిత్య కార్యశాలల్లో పాల్గొని బాలసాహిత్య ప్రాధాన్యతను తెలియజేశారని పెందోట పురస్కార కమిటీ అభినందించింది.

ట్రాన్స్‌జెండర్లకు సమాన అవకాశాలు

సిరిసిల్లటౌన్: సమాజంలో ట్రాన్స్‌జెండర్లకు సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చిందని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేకంగా గుర్తింపుకార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లు వారి వివరాలను సఖీ కేంద్రం, కలెక్టరేట్‌లోని సంక్షేమాధికారి ఆఫీస్‌లో అందించాలని కోరారు. సఖీ సెంటర్ నిర్వాహకులు రోజా తదితరులు ఉన్నారు.

సమ్మె వీడి విధుల్లో చేరండి

సిరిసిల్లకల్చరల్: జిల్లాలోని అంగన్‌వాడీలు సోమవారం నుంచి తలపెట్టిన సమ్మెకు దూరంగా ఉండాలని జిల్లా సంక్షేమాధికారి పి.లక్ష్మీరాజం కోరారు. ప్రభుత్వం చర్చలకు సిద్ధంగా ఉందని మంత్రి సత్యవతి రాథోడ్, కమిషనర్ భారతి ప్రకటించిన నేపథ్యంలో అంగన్‌వాడీలు వెంటనే విధుల్లో చేరాలని లేకుంటే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. మినీఅంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా మార్చిన నేపథ్యంలో వారు సమ్మెకు దూరంగా ఉంటున్నట్లు లేఖ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. టీఎన్‌జీవోకు అనుబంధంగా ఉన్న అంగన్‌వాడీ టీచర్ల సంఘం సమ్మెకు దూరంగా ఉంటున్నట్లు ప్రకటించారు. ఈమేరకు అధ్యక్షురాలు సింగరవేని పద్మ ఆధ్వర్యంలో లేఖను జిల్లా సంక్షేమాధికారికి అందజేశారు.

3.5 కిలోమీటర్లు పూర్తయ్యేదెప్పుడో ?

- రెండు జిల్లాల సరిహద్దు రోడ్డుకు గ్రహణం
- చందుర్తి–మోత్కురావుపేట మధ్య అటవీ ప్రాంతంలో నిలిచిన పనులు
- అటవీశాఖ అనుమతికి ఎనిమిదేళ్లుగా ఎదురుచూపులు
- జిల్లా ప్రజలకు తప్పని దూరభారం
- వృథాగా రూ.19.75 కోట్లు



చందుర్తి అటవీ ప్రాంతంలో నిలిచిన రోడ్డు ఇదే..

చందుర్తి(వేములవాడ): రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిల్లాలను కలుపుతూ ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించిన రోడ్డుకు గ్రహణం పట్టుకుంది. రెండు జిల్లాల మధ్య దూరభారం తగ్గించేందుకు 2014లో రూ.19.75కోట్లు మంజూరుకాగా.. పనులు ప్రారంభమయ్యాయి. చందుర్తి నుంచి మేడిపెల్లి మండలం మోత్కురావుపేట మధ్య 3.450 కిలోమీటర్లు అటవీప్రాంతం ఉండడంతో ఆ శాఖ అధికారులు రోడ్డు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం లేదు. ఎనిమిదేళ్లుగా ఈ రోడ్డు పనులు ఆగిపోయాయి. రెండు జిల్లాల మధ్య దూరభారం తగ్గలేదు.

ఎనిమిదేళ్లుగా ఎదురుచూపులే..

చందుర్తి నుంచి మేడిపల్లి మండలం మోత్కురావుపేటకు 13 కిలోమీటర్ల దూరం రోడ్డు నిర్మాణానికి అప్పటి ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు కలిసి 2014లో రూ.19.75 కోట్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించారు. 3.450 కిలో మీటర్లు అటవీ ప్రాంతం ఉంది. ఈ అటవీ ప్రాంతానికి ఇరువైపులా తారు రోడ్డు పూర్తయింది. కానీ 3.450 కిలోమీటర్లు అటవీప్రాంతంలో ఉండడంతో ఆ శాఖ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదు. ఈ రోడ్డు పూర్తయితే దాదాపు రెండు జిల్లాల మధ్య 30 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. చందుర్తి, కోనరావుపేట, వీర్నపల్లి, రుద్రంగి మండలాలకు జగిత్యాల జిల్లా మేడిపల్లి, భీమారం, రాయికల్, జగిత్యాల పట్టణ ప్రాంతాలకు మధ్య దూరం తగ్గనుంది.

సీతారామ ప్రాజెక్టుకు భూముల కేటాయింపు

భద్రాచలం జిల్లాలో నిర్మించిన సీతారామ ప్రాజెక్టులో అటవీ భూమి కోల్పోతే వేములవాడ నియోజకవర్గంలోని కథలాపూర్, మేడిపల్లి మండలాల్లో రెవెన్యూ భూములను అటవీశాఖకు అప్పగించారు. అదే ఇక్కడ 3.450 కిలోమీటర్ల పరిధి అటవీ భూమి కావడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయి.



ఇబ్బందిగా ఉంది

మేడిపల్లి మండలం మోత్కురావుపేటలోని అత్తారింటికి వెళ్లాలంటే ఈ రోడ్డు పూర్తయితే 10 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే సరిపోద్ది. ఇది పూర్తి చేయకపోవడంతో రుద్రంగి నుంచి కథలాపూర్ మండలం తాండ్ర్యాల మీదుగా మోత్కురావుపేటకు 40 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుంది.
– మర్రి సాయికుమార్, చందుర్తి



అటవీభూమిని ఇప్పించలేకపోయారు

రెండు జిల్లాల సరిహద్దు ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని ఈ రోడ్డు పనులు చేపట్టారు. భద్రాచలం జిల్లాలో నిర్మించిన ప్రాజెక్టు కోసం మేడిపల్లి, కథలాపూర్ మండలాల్లోని రెవెన్యూ భూమిని అటవీశాఖకు అప్పగించారు. రోడ్డు నిర్మాణానికి మాత్రం అటవీ భూమిని ఇప్పించలేకపోయారు.
– చింతపంటి రామస్వామి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు



అనుమతుల కోసం చూస్తున్నాం

చందుర్తి–మోత్కురావుపేట గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో రోడ్డు నిర్మాణానికి ఆ శాఖ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో పనులు నిలిచిపోయాయి. అటవీశాఖ భూమికి బదులు కోనరావుపేట మండలం కొండాపూర్ శివారులోని రెవెన్యూ భూమిని అప్పగించారు. అనుమతుల కోసం ఎదురుచూస్తున్నాం. అనుమతులు వచ్చిన వెంటనే పనులు పూర్తి చేయిస్తాం.
– సతీశ్, ఆర్‌అండ్‌బీ, ఏఈ, చందుర్తి

క్లుప్తంగా

రాజన్న సేవలో మహారాష్ట్ర మంత్రి



స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఈవో కృష్ణప్రసాద్

వేములవాడ: మహారాష్ట్ర ఆటవీశాఖ మంత్రి సుధీర్ మునిగంటి వార్ దంపతులు ఆదివారం రాజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. స్వామివారి దర్శనం అనంతరం మహామండపంలో అర్చకులు వేదోక్త ఆశీర్వచనం గావించారు. ఆలయ ఈవో కృష్ణప్రసాద్ శేషవస్త్రం కప్పి స్వామివారి ప్రసాదం అందజేశారు. మంత్రి వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఏఈవోలు బి.శ్రీనివాస్, జయకుమారి, నవీన్, పర్యవేక్షకులు తిరుపతిరావు, శ్రీరాములు ఉన్నారు.

వాలీబాల్ జట్టుకు ట్రాక్‌సూట్లు అందజేత



ట్రాక్‌సూట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావు

ముస్తాబాద్(సిరిసిల్ల): రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన ఎల్లారెడ్డిపేట మండలం దుమాల జట్టుకు జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు ట్రాక్‌సూట్లను ఆదివారం అందజేశారు. వాలీబాల్ క్రీడలో విశేషంగా రాణిస్తున్న యువకులను అభినందించారు. ఇప్పటికే ఎన్నో టోర్నమెంట్లను గెలుచుకున్న దుమాల జట్టు రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, గుర్లపెల్లి నర్సింహారెడ్డి, బండారి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

250 మందికి అన్నదానం



అన్నదానం చేస్తున్న ట్రస్టు సభ్యులు

వేములవాడ: మన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 250 మందికి ఆదివారం రాజన్న గుడి మెట్లపై అన్నదానం చేశారు. ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం మాజీ అధ్యక్షుడు ఏగిన మురళి వర్ధంతిని పురస్కరించుకుని ఆలయ ఆవరణ, అంబేద్కర్ విగ్రహం వద్ద యాచకులు, అనాథలు, భక్తులకు అన్నదానం చేసి స్వీట్లు అందించినట్లు ట్రస్టు ప్రతినిధులు మోటూరి మధు, నటరాజ్ తెలిపారు. అలాగే వాసవీ నిత్యాన్నదాన సత్రంలో ఏగిన మురళి వర్ధంతిని పాలకవర్గ సభ్యులు, ఆర్యవైశ్యులు, పురప్రముఖులు జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రేషన్ బియ్యం పట్టివేత

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. గండిలచ్చపేటకు చెందిన బొమ్మెన సమ్మయ్య ట్రాలీ ఆటలో 5 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందన్నారు. బియ్యం, ట్రాలీ ఆటోను స్టేషన్‌కు తరలించి, సమ్మయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



పట్టుబడిన బియ్యం

వానొస్తే మునకే !

- ఏటా లో లెవల్.. హై లెవల్ వంతెనలతో కష్టాలు
- చిన్నపాటి వర్షాలకే రాకపోకలు బంద్



గంభీరావుపేట-లింగన్నపేట గ్రామాల మధ్య నీట మునిగిన వంతెన

గంభీరావుపేట(సిరిసిల్ల): ఏటా వానాకాలంలో లో లెవల్ వంతెనలు, కల్వర్టులపై నుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. వరద నీటి ప్రవాహంతో ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలకేంద్రమైన గంభీరావుపేట, లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై లోలెవల్ వంతెన ప్రతి వర్షాకాలంలో మానీటి ఉధృతిలో మునిగిపోయి రాకపోకలు నిలిచిపోతుంటాయి. రెండేళ్ల క్రితం ఓ ఆర్టీసీ బస్సు వాగు ఉధృతిలో కొట్టుకుపోయింది. ఈ వానాకాలంలో ఇప్పటికే రెండుసార్లు బ్రిడ్జి నీట మునిగింది. వారం రోజుల నుంచి బ్రిడ్జి నీట మునిగా రాకపోకలు నిలిచాయి. దాదాపు 20కిలోమీటర్ల చుట్టూ తిరిగి మండలకేంద్రానికి రాకపోకలు సాగిస్తున్నారు.

వానొచ్చిన్నప్పుడల్లా..

ఏటా వానాకాలంలో వంతెన మునిగిపోవడం.. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడడం ఆనవాయితీగా మారింది. గతేడాది రెండుమూడుసార్లు బ్రిడ్జి మునిగింది. నిన్న మొన్నటి వానలకు మళ్లీ అదే సీన్ తలెత్తింది. ఎట్టకేలకు నిధులు మంజూరైన పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయో నని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

పనులు ప్రారంభమెప్పుడో..

గంభీరావుపేట- లింగన్నపేట గ్రామాల మధ్య హై లెవల్ వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వం ఇటీవల రూ.13.50 కోట్లు మంజూరు చేసింది. టెండర్లు పూర్తయ్యాయి. పనులు ప్రారంభించే లోపే వానాకాలం వచ్చింది. మళ్లీ వరదకు లో లెవల్ వంతెన మునిగి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. గంభీరావుపేట, లింగన్నపేట గ్రామాల మధ్య బ్రిడ్జి ద్వారా లింగన్నపేట, మల్లారెడ్డిపేట, కొత్తపల్లి, కోళ్లమద్ది, ము చ్చర్ల, రాజుపేట, శ్రీగాధ తదితర గ్రామాల నుంచి మండలకేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే సిద్దిపేట, కామారెడ్డి, సిరిసిల్ల పట్టణాలకు ఈ మార్గం గుండానే ప్రయాణం చేయాల్సి ఉంటుంది.

ఏళ్లుగా ఇదే సమస్య



వానలు పడి నర్మాల మానేరు పొంగినప్పుడల్లా బ్రిడ్జి మునిగిపోతోంది. ఇది ఏళ్లతరబడి జరుగుతోంది. ప్రయాణికులు, ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈసారి కూడా ఇబ్బందులు తప్పడం లేదు. త్వరగా బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టి ఏళ్లనాటి సమస్యను పరిష్కరించాలి. – దేవసాని క్రిష్ణ, గంభీరావుపేట

పనులు త్వరలోనే ప్రారంభమవుతాయి



గంభీరావుపేట–లింగన్నపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.13.50కోట్లు మంజూరు చేయించిన మంత్రి కేటీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. టెండర్లు పూర్తయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయి. ఏళ్లనాటి సమస్య త్వరలోనే పరిష్కారమవుతుంది. – కటకం శ్రీధర్‌పంతులు,సర్పంచ్, గంభీరావుపేట

వేములవాడ పరిధిలో..

వేములవాడ: వేములవాడకు చేరుకునే మూడు మార్గాల్లో లో–లెవల్ వంతెనల వల్ల భక్తులతోపాటు పరిసర మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షాలకే లో లెవల్ వంతెనలపైనుంచి వరదనీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు బంద్ అవుతున్నాయి. ఎంతో దూరం నుంచి అష్టకష్టాలను ఓర్చుకుని సమీపం వరకు చేరుకుంటున్న భక్తులు, తమ అవసరాల కోసం వేములవాడకు వచ్చే పరిసర గ్రామాల ప్రజలు వెనుదిరిగి వెళ్లిపోవాల్సిన దుస్థితి నెలకొంది. అంతేకాకుండా ఎంతో దూరం నుంచి చుట్టూరా తిరుగుతూ వేములవాడకు చేరుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు.



‘ఈ చిత్రం వేములవాడ పట్టణ శివారులోని మల్లారం రోడ్డులో గల కట్టుకాలువ. చిన్నపాటి వర్షానికే ఇలా ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు నిలిచి పోతున్నాయి. దీంతో 20 గ్రామాల ప్రజలు, రైతులకు తమతమ అసరాలు ఇట్టే నిలిచి పోతున్నాయి. కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెప్పుకుంటున్న పాలకులు ఇక్కడ హైలెవల్ వంతెన నిర్మాణంపై దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు’.



‘ఇది వేములవాడ సమీపంలోని శాత్రాజుపల్లి వద్దనున్న వాగు. వర్షం కురిసినప్పుడల్లా ఈ ప్రాంతంలోని గ్రామస్తులకు అవస్థలు తప్పడం లేదు. రాజన్నకు మొక్కులు చెల్లించుకొని కొండగట్టు అంజన్న దర్శనానికి వెళ్లే భక్తులంతా ఈ వాగు ప్రవాహంతో ఇబ్బందులుపడుతున్నారు. నూకలమర్రి లేదా కొదురుపాక మీదుగా జగిత్యాల రోడ్డుకు వెళ్లాల్సిన పరిస్థితి.



‘ఈ ఫొటోలో ఉన్నది బోయిన్‌పల్లి– వేములవాడ మధ్యలోని వాగు. చిన్న వర్షానికి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు బ్రేక్ పడుతుంది. ఈ ప్రాంత ప్రజలు, ఇటుగా వచ్చే రాజన్న భక్తులు వయా కొదురుపాక మీదుగా దూరభారంతో అష్టకష్టాలతో స మయం వృథా చేసుకుంటూ వెళ్లాల్సి వస్తోంది’.

సమయం వృథా..



చిన్నపాటి వర్షానికి లో లెవల్ వంతెనల మీదుగా వరదనీరు ప్రవహిస్తుండటంతో దూర ప్రాంతాల నుంచి వేములవాడకు చేరుకోవాల్సి వస్తుంది. దూరభారంతోపాటు సమ యం వృథా అవుతుంది. పాలకులు లోలెవల్ బ్రిడ్జిల స్థానంలో హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించాలి.
– జంగం అంజయ్య, అడ్వకేట్, బోయిన్‌పల్లి

కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రావణకాష్టమైంది

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రసమయి

ఇల్లంతకుంట(మానకొండూర్): నలభై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రాంతం రావణకాష్టమైందని మానకొండూర్ ఎమ్మెల్యే, సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని అనంతగిరి గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ప్రారంభంతో పాటు నూతన గ్రామపంచాయతీ భవనం, ప్రభుత్వ పాఠశాల, వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. పోచమ్మ ఆలయ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రైతాంగం చుక్కనీరు లేక గల్ఫ్ దేశాలకు వెళ్లి కుటుంబాలను పోషించుకున్నారని, రాష్ట్రం ఏర్పాటై కేసీఆర్ సీఎం అయ్యాక నెర్రెలు బారి, బీడువారిన పొలాలన్నీ కాళేశ్వరం జలాలతో పచ్చటి మాగాణులయ్యాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ మాయలో పడి ప్రజలు మోసపోవద్దని, ఎన్నికలు ఎప్పుడొచ్చినా రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌దే అధికారమని, కేసీఆర్ మూడోసారి సీఎం కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డి, వైస్‌ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, సర్పంచ్ పల్లె నర్సింహారెడ్డి, ఎంపీటీసీ పర్శరాం, ఏఎంసీ చైర్మన్ సంజీవ్, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ గొడుగు తిరుపతి, ఉపసర్పంచ్ బాలకిషన్ తదితరులున్నారు.

జీవితం కవిత్వానికి కొలమానం

- తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి



సన్మానిస్తున్న సిధారెడ్డి తదితరులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కవిత్వానికి జీవితమే కొలమానం అని, తెలంగాణ నేల కొత్తశక్తిని అందిస్తుందని రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లాకేంద్రంలోని ఫిలింభవన్‌లో ఆదివారం జరిగిన కాళోజీ పురస్కార ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కవిత్వానికి రూపం, శిల్పం అలంకారాలు మాత్రమేనని రమ్యం కాదని, సామాన్య మానవుడిని ఒప్పించేది మాత్రమే కవిత్వంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కవిత్వానికి కులాలు, మతాలతో సంబంధమే లేదన్నారు. మంచి కవిత్వం పది కాలాల పాటు నిలిచిపోతుందని వివరించారు. ప్రైజ్ మనీతో సంబంధం లేకుండా హృదయంతో ఇచ్చే పురస్కారం ప్రోత్సాహాన్ని అందిస్తుందని, అదే కాళోజీ నారాయణరావు పేరిట అందించే ఈ పురస్కారమని వెల్లడించారు. కవులకు పురస్కారాలు ప్రేరకాలుగా ఉంటాయన్నారు. అనంతరం ప్రముఖ కవి కందుకూరి శ్రీరాములుకు 2023వ సంవత్సరానికిగాను కాళోజీ పురస్కారంతో పాటు ప్రశంసాపత్రం, రూ.2వేల నగదు అందించారు. కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త అనిల్‌కుమార్, గంద్ర లక్ష్మణ్‌రావు, దాస్యం సేనాధిపతి, వేణు, కేఎస్ అనంతాచార్య, గుర్రాల మాధవ్, బొమ్మకంటి కిషన్, డాక్టర్ నలిమెల భాస్కర్, డాక్టర్ కలువకుంట్ల రామకృష్ణ, గులాబీల మల్లారెడ్డి, చిందం సునీత, బూర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులు, సీనియర్లను గుర్తించాలి



సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): తెలంగాణ ఉద్యమకారులు, పార్టీలో పనిచేసిన సీనియర్లను గుర్తించి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని ఎల్లారెడ్డిపేట మండల బీఆర్‌ఎస్ నాయకులు కోరారు. ఈమేరకు ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు సమావేశమయ్యారు. గతంలో పదవులు అనుభవించిన వారికే తిరిగి పదవులు ఇస్తున్నారని నమిలికొండ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యలను కలిసి మండలంలోని సీనియర్లకు పదవులు ఇచ్చేలా కోరాలని తీర్మానించారు. బీఆర్‌ఎస్ బలోపేతానికి కృషి చేసిన వారిని గుర్తించాలన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్‌లు నర్సాగౌడ్, మల్లేశం, మాజీ ఎంపీటీసీ పులి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రేత అరెస్ట్



పోలీసుల అదుపులో గుండుంబా విక్రేత

వేములవాడరూరల్: గుడుంబా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వేములవాడ రూరల్ ఎస్‌ఐ మారుతి తెలిపారు. కోనరావుపేట మండలం వట్టిమల్లకు చెందిన డొక్క నారాయణ వేములవాడ రూరల్ మండలం జయవరం గ్రామ శివారులో గుడుంబా విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు ఆదివారం పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అతడి నుంచి 33 గుడుంబా ప్యాకెట్లు, దాదాపు 16 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఏఎస్‌ఐ లక్‌పతి, హెడ్‌కానిస్టేబుల్ రాజేందర్, కానిస్టేబుళ్లు ఆరిఫ్, శంకర్, సతీష్, శ్రీనివాస్, రాజశేఖర్ ఉన్నారు.


ప్రతిభ ప్రతిబింబించేలా..

- విద్యార్థుల విజ్ఞానానికి చక్కని వేదిక మంథన్
- ఈనెల 15 దరఖాస్తులకు చివరి తేదీ

జ్యోతినగర్(రామగుండం): విద్యార్థి దశ నుంచి సైన్స్‌పై ఆసక్తి కలిగించడం, శాస్త్ర సాంకేతిక అభివృద్ధిలో భారతీయుల కృషి తెలియజేసే ఉద్దేశమే విద్యార్థి విజ్ఞాన్ మంథన్. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్టీ), విజ్ఞాన భారతి, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం సంయుక్తంగా విద్యార్థి విజ్ఞాన్ మంథన్ పేరుతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఏటా ఆన్‌లైన్ వేదికగా ప్రతిభ పరీక్ష నిర్వహిస్తోంది.

పరిశోధన సంస్థల సందర్శన

- పలు జాతీయ ప్రయోగశాలల సందర్శనతో పాటు నగదు ప్రోత్సాహకాలు అందుకునే అరుదైన అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తోంది.
- ఇందులో డీఆర్డీవో, బార్క్, సీఎస్‌ఐఆర్ వంటి ప్రఖ్యాత పరిశోధన సంస్థలున్నాయి. వాటిని సందర్శించే అవకాశంతో పాటు మూడు వారాలు ఇంటర్న్‌షిప్ చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పరీక్ష నిర్వహిస్తోంది.
- ఇందులో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆ ప్రయోగశాలల సందర్శనతో కొత్త స్ఫూర్తి పొందే అవకాశముంది. 2024 సంవత్సరానికి సంబంధించి జాతీయస్థాయి పరీక్ష మే 18, 19న నిర్వహించనున్నారు.
- నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్టీ), విజ్ఞాన భారతి, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 6 నుంచి 11వ తరగతి (ఇంటర్ ప్రథమ సంవత్సరం) విద్యార్థులకు ఆన్‌లైన్ వేదికగా ఈ పరీక్ష నిర్వహిస్తారు.
- 6 నుంచి 8వ తరగతి వరకు జూనియర్లుగా, 9 నుంచి 11 వరకు సీనియర్లుగా పరిగణిస్తారు. ఐసీఎస్‌ఈ, సీబీఎస్‌ఈ, రాష్ట్ర బోర్డు విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులు.



వీవీఎం లోగో

ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష..

అక్టోబరు 1న నమూనా పరీక్ష ఉంటుంది. అదే నెల 29 లేదా 30న జిల్లాస్థాయిలో పరీక్షను ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. సీనియర్, జూనియర్ విభాగంలో 100 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు ఉంటుంది. గణితం, సామాన్య శాస్త్ర పాఠ్య పుస్తకాల నుంచి 50 శాతం, విజ్ఞానశాస్త్రం రంగంలో దేశ కృషిపై 20 శాతం, లాజిక్ రీజనింగ్‌కు 10 శాతం, శాస్త్రవేత్త బీర్బల్ సహానీ జీవిత చరిత్రకు 20 శాతం బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి.

జిల్లాస్థాయిలో ఇలా..

జిల్లాలో ఆరో తరగతి నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం వరకు ప్రతి తరగతిలో ప్రతిభచూపిన మొదటి ముగ్గురు చొప్పున మొత్తం 18 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలను ఆన్‌లైన్‌లో అందిస్తారు.

రాష్ట్రస్థాయిలో..

పాఠశాల స్థాయి ప్రాథమిక పరీక్ష రాసిన విద్యార్థుల్లో తరగతుల వారీగా ప్రతిభచూపిన మొదటి 20 మంది విద్యార్థులను ఎంపిక చేసి మొత్తం 120 మందిని రాష్ట్రస్థాయికి పంపుతారు. అత్యంత ప్రతిభకనబర్చిన 18 మందిని రాష్ట్రస్థాయి విజేతగా ప్రకటిస్తారు. వారిలో మొదటి ముగ్గురికి రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలిస్తారు.

జాతీయ స్థాయిలో..

రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చినవారి నుంచి 18 మందిని జాతీయ స్థాయి ప్రతిభావంతులుగా గుర్తిస్తారు. వీరిని హిమాలయన్స్ అంటారు. వారికి రూ.25 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు నగదు ప్రోత్సాహకాలు ఇస్తారు. వీటితో పాటు నెలకు రూ.2 వేల చొప్పున ఏడాది పాటు ఉపకారవేతనం అందిస్తారు.

దరఖాస్తు ఇలా..

2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ ద్వారా విద్యార్థి విజ్ఞాన్ మంథన్ (వీవీఎం) పరీక్ష నిర్వహించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. పోటీలు పాఠశాల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో నిర్వహిస్తారు. www. vvm. org. in వెబ్‌సైట్‌లో రూ.200 ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించి ఈనెల 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అక్టోబరు 1న నమూనా పరీక్ష నిర్వహిస్తారు. తెలుగు, హిందీ, ఆంగ్లం విభాగాల్లో పరీక్ష ఉంటుంది.

విద్యార్థులకు మంచి అవకాశం



విద్యార్థుల విజ్ఞానానికి మంచి అవకాశం. పరీక్షను విద్యార్థులు వ్యక్తిగతంగా, పాఠశాల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సైన్స్ ప్రయోగాలకు బీజం పాఠశాల స్థాయి నుంచే కలగాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఏటా దీన్ని నిర్వహిస్తోంది. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి, అభిరుచి కలిగించడం , వారిలోని నైపుణ్యాలు, సృజనాత్మకతను వెలికితీయడం ఈ పరీక్ష ఉద్దేశం. వీవీఎం పరీక్షల్లో విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. – బి.రవినందన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి, పెద్దపల్లి

దుబాయ్‌లో మండెపల్లి వాసి మృతి



విషాదంలో కుటుంబ సభ్యులు



పర్శరాములు (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బతుకుదెరువు కోసం గల్ఫ్‌బాట పట్టిన వలసజీవి అక్కడే గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలం మండెపల్లి గ్రామానికి చెందిన లింగం పర్శరాములు(38) నాలుగేళ్లుగా బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడ అల్జమాల్ కంపెనీలో లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన పర్శరాములు జూలై 9న తిరిగి దుబాయ్ వెళ్లాడు. శనివారం రోజువారీగా పనికి వెళ్లి అక్కడే గుండెపోటుకు గురై మరణించాడు. మృతుడికి భార్య అనూష, మూడేళ్ల కూతురు జశ్విత, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు ఉన్నారు. ప్రస్తుతం భార్య గర్భిణి. ఇంటి పెద్ద దిక్కు మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. పర్శరాములు మృతదేహాన్ని దుబాయ్ నుంచి స్వగ్రామానికి తెప్పించేందుకు మంత్రి కేటీఆర్ సాయం చేయాలని వేడుకుంటున్నారు.

రాష్ట్రంలో రాక్షస రాజ్యం పోతుంది



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సత్యనారాయణ, నాయకులు

ఇల్లంతకుంట(మానకొండూర్): పదేళ్ల కేసీఆర్ పాలన తెలంగాణలో రాక్షస రాజ్యాన్ని తలిపించిందని, త్వరలోనే తెలంగాణ ప్రజలకు విముక్తి లభించి, కాంగ్రెస్ పాలన వస్తుందని ఆ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చాడన్నారు. రైతులకు లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు చేయలేదని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని మూలనపడేశారన్నారు. ఇప్పుడు దళితబంధు పేరుతో దళితులను దగా చేస్తున్నారని, ఎక్కడో నలుగురికి దళితబంధు ఇచ్చి, ప్రతి కుటుంబానికి ఇచ్చినట్లు సీఎం కేసీఆర్ మాయమాటలు చెప్పి మోసం చేస్తున్నారన్నారు. బీసీ బంధు పేరుతో ఓట్ల రాజకీయాలు చేస్తున్నారని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎక్కడా కూడా అమలు జరగడం లేదన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ సర్కారుకు త్వరలోనే తగిన గుణపాఠం చెప్పబోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూంపెల్లి రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య, అంతగిరి వినయ్‌కుమార్, పసుల వెంకటి, కర్ణాకర్‌రెడ్డి, పాశం రాజేందర్‌రెడ్డి, ఒగ్గు రమేష్, బాలపోచయ్య, నరేష్, సురేందర్‌రెడ్డి, జమాల్, వీరేశం, రోషాలు, రాజేశం తదితరులున్నారు.

40 ఏళ్లలో అభివృద్ధి అంతంతే

కోనరావుపేట(వేములవాడ): కోనరావుపేట మండలంగా ఏర్పాటై 40 ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉందని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలాభివృద్ధిపై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో అఖిల పక్ష, విద్యార్థి, ప్రజానేతలతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. స్థానిక రైతువేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు తమ అభిప్రాయాలు వ్యక్తంచేశారు. లైవ్ జిల్లా అధ్యక్షుడు బానోత్ నరేశ్‌కుమార్ మాట్లాడుతూ, మల్కపేట రిజర్వాయర్ పూర్తికాకున్నా, సాగు నీరు రాకున్నా కోనరావుపేట కోనసీమ అంటూ ప్రచారం చేస్తున్నారని, పోడు భూముల సమస్యలు అలాగే ఉన్నాయన్నారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు అంగూరి రంజిత్ మాట్లాడుతూ, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి, విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. బీజేవైఎం జిల్లా నాయకుడు చల్ల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ, యువకులు గంజాయి, మద్యానికి బానిస కాకుండా చర్యలు తీసుకొని, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. బీఎస్పీ మండలాధ్యక్షుడు కుమ్మరి దేవదాస్ మాట్లాడుతూ, మూలవాగుపై వంతెనలు నిర్మించి, ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే కోనరావుపేటలో డిగ్రీ కళాశాల, బీసీ మహిళా గురుకుల పాఠశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ప్రకాశ్, అమర్, రాకేష్, ఎరవెల్లి విజయ్, మాసం జనార్దన్, మనోజ్, గౌతం, సురేశ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.